

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త
ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. 8లో▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ మంగళ : 6:31
సహర్ బుధ : 4:46

గరిష్ఠం/కనిష్ఠం 41.4 /29.5
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వా వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

నిర్మల్‌ఖైసేగేట్: కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కో కన్వీనర్ రాచకొండ విఘ్నేష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ 4వ జిల్లా మహాసభలు ప్రజానంభూల ఆఫీస్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ధ్వంసం చేస్తున్నాయన్నారు. నిర్మల్ జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని, బాసర ఐఐఐటీకి అధిక నిధులతో బడ్జెట్ ఇవ్వాలని కోరారు. నూతన జిల్లా కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నవీన్, జిల్లా కార్యదర్శి దిగంబర్, జిల్లా ఉపాధ్యక్షుడు పరమేష్, నితిన్, నీరజ, జిల్లా సహాయ కార్యదర్శులు నితిన్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్‌టౌన్: ప్లాస్టిక్ వాడకం అనేక అనర్థాలకు దారితీస్తుందని, ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ , శ్రీగ్రీన్ వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బదులావ్- క్యాంపెయిన్ అంటూ...ప్లాస్టిక్ వాడకాలపై జరిగే అనర్థాలపై సోమవారం విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి, నృత్యంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పచ్చదనం పెంపునకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, నిత్యజీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని కూడా వీలైనంతగా తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే వ్యాపారులు, ఫంక్షన్ హాళ్ల యజమానులకు అవగాహన కల్పించామని చెప్పారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో బదులావ్ క్యాంపెయిన్ ఫీల్డ్ కోఆర్డినేటర్ శరత్ చంద్ర, ఎంఆర్ఎస్ ఇన్‌చార్జి మంజీషా రౌత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న రాజేందర్

దస్తురాబాద్: ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎండల తీవ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పనికి వెళ్లే ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉదయం 11 గంటలలోపు వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని ఇంటికి చేరుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు చందన, ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ లలిత, మురళీకృష్ణ, రాజేందర్, మల్లేశం, మధు, ఏఎన్ఎంలు పాల్గన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌ఖైసేగేట్: లోకసభ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న మాట్లాడారు. బీపీ, మధుమేహం, గుండె సంబంధ వ్యాధులతో బాధపడేవారు, దివ్యాంగులు, గర్భిణులు, ఫీడింగ్ మదర్స్, 58 ఏళ్లు దాటిన వారికి విధుల నుంచి మినహాయింపు నివ్వాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి రవిరాజ్, రాష్ట్ర నాయకులు సోప్పర్వార్ శంకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బామండ్ల శంకర్, జిల్లా నాయకులు అడప శ్రీకాంత్, హరీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్ర'జల' పాట్లు!



చింతకుంట తండాలో వ్యవసాయ బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

- వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య
- చాలా ఊళ్లకు అందని 'భగీరథ'
- వ్యవసాయ బావులపై ఆధార పడుతున్న జనం
- పలు గ్రామాల్లో 'సాక్షి' గ్రౌండ్‌రిపోర్ట్

నిర్మల్: వేసవికాలం ఆరంభంతోనే జిల్లాలోని పలు గ్రామాల్లో నీటికష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సాగునీటికి పెద్దగా ఇబ్బంది లేకున్నా తాగునీటికే ఇక్కట్లు మొదలవుతున్నాయి. గ్రామాలు, తండాల్లో ఈ పరిస్థితి తీవ్రమవుతోంది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిపెడుతున్నప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. వేసవి ప్రారంభం నేపథ్యంలో మూడు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సోమవారం 'సాక్షి గ్రౌండ్‌రిపోర్ట్' చేపట్టింది.

'భగీరథ' కష్టాలు..
ఇంటింటికీ తాగునీరందిస్తామంటూ గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం అడుగడుగునా అటంకాలను ఎదుర్కొంటూనే ఉంది. భైంసాలోని గడ్డెన్నవాగు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టుల నుంచి ట్రీట్‌మెంట్‌ప్లాంట్లు, వాటర్‌గ్రిడ్‌లకు, అక్కడి గ్రామాల్లోని వాటర్‌ట్యాంకులకూ తాగునీరు బాగానే చేరుతోంది. ఆ ట్యాంకుల నుంచే ఇళ్లకు చేరడం లేదు. కొన్నిచోట్ల నాసిరకపు పనులు, ఇష్టారీతిన వేసిన పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటికి తోడు గ్రామాల్లో కొత్తగా రోడ్లు వేసినా, డ్రైనేజీలు తవ్వినా.. మిషన్ భగీరథ పైపులైన్లను కనీసం చూసుకోకుండానే తవ్వేస్తున్నారు. అలా దెబ్బతిన్న వాటిని మరమ్మతులు చేసే పరిస్థితులు కూడా లేకపోవడంతో ఇంటింటికీ నీళ్లు అందడం లేదు.

ట్యాంకుల నుంచి..
తానూరు మండలం బెంబర ఆబాదిలో 150 ఇళ్లు ఉంటాయి. ఇక్కడ మిషన్ భగీరథలో ఇంటింటికీ నల్లాలు ఇచ్చినప్పటికీ నీళ్లు మాత్రం రావడం లేదు. వాటర్ ట్యాంకుల్లోకి నీళ్లు వస్తున్నప్పటికీ ఇంటింటికీ రావడం లేదు. దీంతో ట్యాంకుల వద్ద నుంచే గ్రామస్తులు బిందెలతో నీటిని మోసుకువెళ్లాల్సి వస్తోంది. ఒక్కోసారి రెండుమూడురోజులపాటు ఈ నీళ్లు కూడా రావడం లేదు.

ఆ నీళ్లను తాగడం లేదు..
గత ప్రభుత్వం రూ.లక్షల కోట్లు వెచ్చించి మిషన్ భగీరథ చేపట్టినా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఈ పథకం నీటిని తాగడం లేదు. కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగించుకుంటున్నారు. కుంటాల మండలంలోని మెదన్‌పూర్ గ్రామంలో పరిశీలించగా, గ్రామానికి మిషన్ భగీరథ నీరు వస్తున్నా.. చాలామంది తాగడం లేదని చెప్పారు. ఆ నీళ్లు బాగుండడం లేదంటూ బోరుబావుల నీటిపైనే ఆధారపడుతున్నారు. ఇక్కడి ఎస్సీకాలనీలో బోరుబావి ఉన్నప్పటికీ విద్యుత్ మోటార్ బిగించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.

ట్యాంకెక్కని నీళ్లు..

సారంగాపూర్ మండలం రవీంద్రనగర్ గ్రామ పంచాయతీలో మొత్తం 87 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో 86 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ వాటర్‌ట్యాంక్ కూడా ఉంది. కానీ మిషన్ భగీరథ నీళ్ల ట్యాంకులోకి ఎక్కడం లేదు. ఈ గ్రామం ఎత్తుప్రాంతంలో ఉండటంతోపాటు వాటర్‌ట్యాంక్ కూడా ఎత్తుగా ఉండటంతో నీళ్లు సక్రమంగా రావడం లేదు. దీంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మూడు బోరుబావులను మరమ్మతులు చేయించారు. మరో బోరుబావిని కూడా సిద్ధం చేస్తున్నారు. వీటి ద్వారానే నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.


రవీంద్రనగర్‌లోని వాటర్‌ట్యాంక్

పొలాల్లో నుంచి నీళ్లు..



ముధోల్: ఈ ఫొటో ముధోల్ మండలం చింతకుంట గ్రామపంచాయతీ అనుబంధమైన చింతకుంటతండా వాసులది. ఇక్కడ దాదాపు 400 మంది జనాభా, 275 మంది ఓటర్లు ఉన్నారు. ఐదేళ్లక్రితమే నిర్మించిన వాటర్‌ట్యాంక్ ఉన్నప్పటికీ మిషన్ భగీరథ నీరు అందడం లేదు. ఈ గ్రామంలో చేతిపంపులు, బోరుబావులు కూడా లేవు. దీంతో పొలాల్లో వేసుకున్న బోరుబావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటికి రాని నీళ్లు..

దస్తురాబాద్ మండలం రేవోజీపేట్, బుట్టాపూర్, భూత్కురు గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. దాదాపు రెండు నెలలుగా నీళ్లురావడం లేదు. ఈ గ్రామాల్లోని వాటర్‌ట్యాంకులకు నీళ్లు వస్తున్నప్పటికీ ఇంటింటికీ సరఫరా కావడం లేదు. చాలాచోట్ల పైపులైన్‌ల లీకేజీలు ఎక్కువగా ఉండటంతో నీటిసరఫరా కావడం లేదు. బోర్లు, చేదబావులపైనే ఆధారపడాల్సి వస్తోంది.


బుట్టాపూర్‌లో ధ్వంసమైన పైప్‌లైన్

తాగునీటికి తిప్పలు..



గ్రామానికి భగీరథ నీళ్లు రావడం లేదు. ప్రభుత్వ బోర్లు, చేతిపంపులు లేవు. దీంతో వేరే వాళ్ల పొలాల్లో వేసిన బోరుబావుల నుంచి నీళ్లను తెచ్చుకోవాల్సి వస్తోంది. కరెంటు లేకపోతే ఆ నీళ్ల కోసం వేచిచూడాలి.

– రేణుకాబాయి, చింతకుంటతండా, మం.ముధోల్

పైపులు పగిలినయ్..



గ్రామంలో మా ఇంటిముందే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. మరమ్మతులు చేయకపోవడంతో నీరంతా ఇంటిముందుకు వస్తోంది. వాటర్ ట్యాంకులకు వస్తున్నా పైపులు పలుచోట్ల లీకేజీలు ఉండటంతో ఇళ్లకు భగీరథ నీళ్లు రావడం లేదు.

– రాజేశ్, బుట్టాపూర్, మం.దస్తురాబాద్

పోలింగ్ అవగాహన ఉండాలి


ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఉట్నూర్ ఆర్డీవో

నిర్మల్‌ఖైసేగేట్: ఎన్నికల సిబ్బంది పోలింగ్ విధులు, ఈవీఎం యంత్రాల పనితీరుపై పూర్తి అవగాహన కలిగి వుండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధానంపై మాస్టర్ ట్రైనర్స్ బి.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి శిక్షణ, అవగాహన సోమవారం కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవో అధికారుల పాత్ర కీలకమన్నారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాలలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సామగ్రి, ఫారాలు, కవర్స్, మెటీరియల్స్, ఈవీఎం యంత్రాలలో క్లోజ్, రిజల్టు, క్లియర్ వ్యవస్థలపై, వీవీప్యాట్ లో 7 సెకన్లలో వచ్చే స్లిప్స్‌పై అవగాహన పొందాలని, పోలింగ్‌కు ముందు మాక్ పోల్ నిర్వహించాలని, నిర్దేశిత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్ సూచనల ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయాలని తెలిపారు. ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు ఫారం–12డి ద్వారా వివరాలు అందించాలని, ఓటు ఉన్న నియోజకవర్గం సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించడంతోపాటు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి, డీఆర్వో భుజంగ్‌రావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ
ఖానాపూర్: ఎన్నికల విధులపై పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హౌస్ ఆఫ్ పీపుల్స్‌లో భాగంగా ఎన్నికలకు సంబంధించిన శిక్షణ ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవీఎం నిర్వహణ 17సీ, 17ఏ, పీవో డైరీ, పీవో డిక్లరేషన్, ఓటర్ స్లిప్స్, మాక్ పోలింగ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. రెండురోజుల పాటు జరిగే శిక్షణను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎన్నికల సమన్వయకర్త లింబాద్రి, ఎంఈవో మధుసూదన్, మాస్టర్ ట్రైనర్ రఫీక్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్: వరి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గోనె సంచులు, లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు కొనుగోళ్లు పూర్తి చేస్తూ ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలించి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు కావాల్సిన వసతుల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. డీఎస్‌వో నందిని, డీసీవో నర్సయ్య, డీఎం శ్రీకళ, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు
దస్తురాబాద్: యాసంగిలో వరి సాగుచేసిన రైతులు ధాన్యం దళారులకు విక్రయించొద్దని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు మండలంలోని ఆకొండపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలకు సూచనలు చేశారు. పీడీ వెంట ఎంపీడీవో రమేశ్, డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపీఎం గంగాధర్, సీసీ రతిలాల్, వీవోఏ బలరాం, వీవోలు ఉన్నారు.

రవీంద్రనగర్‌లో కలెక్టర్ పర్యటన


గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- తాగునీటి సమస్యలపై స్పెషల్‌డ్రైవ్

నిర్మల్: సారంగాపూర్ మండలం రవీంద్రనగర్ తండాలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామ పరిస్థితులపై ఆరా తీశారు. తమ గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని ప్రజలు కలెక్టర్‌కు వివరించడంతో సంబంధిత గ్రిడ్ ఏఈ జ్ఞానేశ్వర్, ఇంట్రా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్‌ను వివరణ కోరారు. గ్రామం ఎత్తులో ఉండడంతో భగీరథ నీరు ట్యాంకును చేరడంలేదని తెలిపారు. అయినా వారంలో రెండురోజులు సరఫరా చేస్తున్నామని బదులిచ్చారు. మిగిలిన నాలుగు రోజులు తాగునీటి అవసరాలకు ఎలా నీరందిస్తున్నారని అడగగా పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్ నాలుగు బోరుబావులకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెచ్చామని ప్రజలు వాటి నీటిని వాడుకుంటున్నారని తెలిపారు. అంతే కాకుండా వ్యక్తిగతంగా చాలామంది ఇళ్లలో బోరు బావులున్నాయని ప్రస్తుతానికి తాగునీటికి సమస్యలు రావడం లేదని తెలిపారు. అయినా మిషన్ భగీరథ నీటిని ప్రజలకు అందజేయడం మన బాధ్యత కదా ఎలా అందిస్తారని అధికారులను కలెక్టర్ అడగగా ట్యాంకు వద్ద ఉన్న బోరుబావికి ఎస్‌డీపీ నిధులు లక్ష రూపాయలతో మరమ్మతులు చేపట్టి వారంలో సోమ, శుక్రవారం మిషన్ భగీరథ నీరు, మిగతా నాలుగు రోజులు బోరుబావి ద్వారా ట్యాంకులోకి నీరందించి ప్రజలకు సరఫరా చేస్తామని వివరించారు. త్వరగా పనులు పూర్తి చేసి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈఈ రామారావు, డీపీవో శ్రీనివాస్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఎంఆర్ఐ ముంతాజ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల టెట్‌పై పునరాలోచించాలి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అర్హతపై ప్రభుత్వం పునరాలోచించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, రవిరాజ్ కోరారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి టెట్ నుంచి సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. టెట్ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యామండలి నిబంధనల పేరుతో ఉపాధ్యాయుల జీవితాలతో ఆడుకోవడం సరికాదన్నారు. పదోన్నతులు వాయిదా వేయడంతో ఉద్యోగంలో చేరిన పోస్టులోనే రిటైర్ అవుతున్నారని తెలిపారు. చివరికి పదోన్నతి లేకుండా రిటైర్మెంట్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 8 నుంచి జరిగే పదో తరగతి స్పాట్‌లో ఉపాధ్యాయుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి నేపథ్యంలో రూంలలో ఫ్యాన్లు, నీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. బీపీ, మధుమేహం, ఓపెన్ హార్ట్ సర్జరీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, దివ్యాంగులు, గర్భిణులు, ఫీడింగ్ మదర్స్, 58 ఏళ్లు పైబడిన వారికి మూల్యాంకనం విధుల నుంచి మినహాయించాలని వివరించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో భామండ్ల శంకర్, అడప శ్రీకాంత్, హరీశ్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌ఖైసేగేట్: రానున్న రెండు నెలలు గ్రామాలు, పట్టణాల్లో ప్రణాళికతో తాగునీరు సరఫరా చేయాలని, సమస్య రాకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు తాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులలో వ్యవసాయ మోటార్లను వినియోగించుకోవాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

అవసరం మేరకు కొనుగోలు కేంద్రాలు....
రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమైనందున అవసరం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. రాబోయే 4 రోజుల్లో 7,149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. 2023-24 వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతీరోజు రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యంతో నడిచేలా చూడాలన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలు..
ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకు రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతీ మండలంలో పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ నియమించాలన్నారు.

వేసవిలో అప్రమత్తంగా..
ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులు ఉదయం పూట నిర్వహించాలని తెలిపారు. వడగాలులు వీస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ , కిశోర్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఈవో రవీందర్ రెడ్డి, డీసీఎస్‌వో నందిని, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నిర్మల్‌ఖైసేగేట్: ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. వడదెబ్బ జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాల గురించి వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలో 'వడదెబ్బ' గురించి టామ్ టామ్ చేయాలని ఆదేశించారు. ప్రతీ ఆశ కార్యకర్త, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ సెంటర్, ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ఎస్ఏ- 2 పరీక్షలు

నిర్మల్ రూరల్: ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 8 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గత నెలలోనే ప్రభుత్వం టైం టేబుల్ ను ప్రకటించగా తాజాగా పరీక్ష సమయంలో మార్పు చేస్తూ కొత్త టైం టేబుల్‌ను విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. దీని ప్రకారం.. 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 11:45 నిమిషాల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. 1 నుంచి 4 తరగతి విద్యార్థులకు 8వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, 10న ఇంగ్లిష్, 15న గణితం, 16న ఈవీఎస్, 6, 7వ తరగతి విద్యార్థులకు 8న ఫస్ట్ లాంగ్వేజ్, 10న సెకండ్ లాంగ్వేజ్, 15న ఇంగ్లిష్, 16న సోషల్ స్టడీస్, 18న జనరల్ సైన్స్, 19న గణితం, 8, 9 తరగతుల విద్యార్థులకు 8న ఫస్ట్ లాంగ్వేజ్, 10న సెకండ్ లాంగ్వేజ్, 15న ఇంగ్లిష్, 16న గణితం, 18న ఫిజికల్ సైన్స్, 19న బయోలాజికల్ సైన్స్, 20వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్షలు ఉంటాయి. గతంలో 8, 9 తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తితో అన్ని తరగతులకు ఉదయమే పరీక్షలు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్సై

జైనథ్: మండలంలోని భోరజ్ ఎక్స్‌రోడ్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న రూ.3,06,300 నగదును పట్టుకున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. వి.శ్రీనివాస్ ఇచ్చోడ నుంచి జైనథ్‌కు మ్యాక్స్ పికప్ వాహనంలో వెళ్తుండగా సోమవారం ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3,06,300 నగదును స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ టీం అధికారి ముత్యంరావుకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం పంచనామా చేసి నగదును ట్రెజరీలో జమ చేసినట్లు ముత్యంరావు తెలిపారు. ఏఎస్సై సిరాజ్, కానిస్టేబుల్ అనిల్, వీడియోగ్రాఫర్ నరేశ్ తదితరులు ఉన్నారు.

మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం

ఆదిలాబాద్‌టౌన్: సీసీఎస్ బృందం ఆధ్వర్యంలో సోమవారం రూ.9700 విలువ గల మద్యాన్ని పట్టుకున్నారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో గైక్వాడ్ మధుకర్ బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.2400 విలువ గల మద్యం పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణ వన్‌టౌన్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలో వాహనంపై మద్యం తరలిస్తున్న మామిడిగూడకు చెందిన మేశ్రం బాలాజీని పట్టుకుని, అతని వద్ద నుంచి రూ.7300 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇద్దరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి స్టేషన్ బాధ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: లోకారిలో మాడ సాయిరెడ్డి వద్ద 11.8 లీటర్ల మద్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బోథ్ మండలంలో..

బోథ్ మండలం నిగిని గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై రాము ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. జాదవ్ సుదర్శన్ వద్ద 5 లీటర్ల గుడుంబాతో పాటు బెల్లం, పటిక, ఇప్పపువ్వును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు జాదవ్ సుదర్శన్ అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పనికి వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో సోమవారం టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బ.. తస్మాత్ జాగ్రత్త

- అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం

మంచిర్యాలటౌన్: వేసవికాలంలో మార్చిలోనే ఎండలు మండుతుండడంతో జనం ముందు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో ప్రతీరోజు 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ ఉదయం 11 గంటల నుంచే నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది.



మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా లక్ష్మీ థియేటర్ చౌరస్తా

ఎల్లో అలర్ట్..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు

- వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడన/చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించండి.
- ఆల్కాహాల్/సిగరెట్/కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండండి.
- ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ వంటివి ధరించండి.
- వేసవిలో ఉదయం/సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 5 నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిది.

చేయకూడని పనులు

- మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఎక్కువగా తిరగరాదు.
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్నవి మాత్రమే తినాలి.
- మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి.
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్బూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుంది.
- శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- వేసవిలో ఆకలి తక్కువగా దాహం ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియలోనూ తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహారపదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన వారిలో కాళ్ల వాపులు, కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పడిపోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి సత్వర వైద్యం అందించాలి.

ప్రాథమిక చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, వస్త్రంతో ఒళ్లంతా తుడవాలి.
- చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించవచ్చు.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

బయటకు వెళ్లొద్దు



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పిల్లలు, వృద్ధులతో పాటు ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. అత్యవసరమైతే తలకు టోపీ ధరించి వెళ్లాలి. చెమట రూపంలో శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. అందుకే లవణాలతో కూడిన ద్రావణం తీసుకోవాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ భర్త



మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీధర్‌రెడ్డి

తాంసి: తాంసి ఎంపీపీ సురుకుంటి మంజుల భర్త శ్రీధర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఇచ్చోడలో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశానికి రాష్ట్రమంత్రి సీతక్క హాజరయ్యారు. ఆమె సమక్షంలో ఆయనతోపాటు గ్రామాలకు చెందిన 300 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా కండువాలు కప్పారు.

నాగోబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న కిరణ్‌మాయి కొప్పిసెట్టి

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కిరణ్‌మాయి కొప్పిసెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులతో మాట్లాడి ఆలయ చరిత్ర, నాగోబా టెంపుల్ నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ఏపీవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ తదితరులు ఉన్నారు.

రైతుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న రైతులు

- గండిపడిన కాలువ పూడ్చివేత

ఖానాపూర్: రైతులే స్వయంగా సోమవారం శ్రమదానం చేపట్టి గండిపడ్డ కాలువను పూడ్చివేశారు. పెంబి మండలం మందపల్లి, వేణునగర్ గ్రామాల సమీపంలోని కొత్తచెరువుకు డీ–28 కాలువ ద్వారా నీరు రావల్సి ఉంది. గత ఖరీఫ్‌లో కాలువకు గండిపడడంతో రాజూరాకు చెందిన డీపీసీ, ఆధ్వర్యంలో మరమ్మతు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు అండర్ టన్నెల్ వద్ద శాశ్వత మరమ్మతు పనులు ప్రారంభించలేదు. కాగా, ఖానాపూర్ మండలం సింగాపూర్ వద్ద కాలువకు కొన్నిరోజుల క్రితం గండిపడింది. దీంతో చెరువులో నీరులేక రైతుల పంటపొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మందపల్లి రైతులు విద్యుత్ మోటార్లతో పంటలకు నీరందించారు. నీరు సరిపోవడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని రైతులు గంగారెడ్డి, మహేశ్, శ్రీనివాస్, సంజీవ్ వాపోతున్నారు. ఆయకట్టు పరిధిలోని 46 మంది రైతులు సొంత ఖర్చులతో జేసీబీ ద్వారా పనులు చేపట్టారు. శ్రమదానం చేసి కాలువ గండిని పూడ్చారు. ఈ విషయమై ఏఈఈ రవినాయక్‌ను వివరణ కోరగా, కాలువ అండర్ రిపేర్‌లో ఉండడం వల్ల రాజూరా, సింగాపూర్ వరకే నీటిని ఇస్తున్నామని, దిగువకు ఇవ్వలేదన్నారు. అయినప్పటికి మందపల్లి రైతులు నీటిని తీసుకుపోవడంతో కాలువకు గండిపడిందన్నారు. కాలువ గండి శాశ్వత మరమ్మతుకు ప్రతిపాదనలు పంపినా కోడ్ కారణంగా టెండర్ పిలవలేదన్నారు.



కాలువ గండికి మరమ్మతు చేసిన ప్రాంతం

పసిడి @ 70వేలు

- పది గ్రాములు ధర
- మధ్య తరగతిపై పెనుభారం
- పనులు లేక స్వర్ణకారుల ఆందోళన

వారం నుంచి ధరలు ఇలా...

తేదీ	ధర(10గ్రాములు)
01/04	రూ.70,000
30/03	రూ.69,200
29/03	రూ.69,000
28/03	రూ.67,950
27/03	రూ.67,800
26/03	రూ.67,900
23/03	రూ.68,000
22/03	రూ.68,300

భైంసాటౌన్: పసిడి ధర రికార్డు స్థాయికి చేరుకుంది. సోమవారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.70వేలు పలికింది. దాదాపు ఏడాదిలోనే ఏకంగా రూ.15 వేలకుపైగా ధర పెరిగి, సామాన్య, మధ్య తరగతి వారికి బంగారం కొనుగోలు పెనుభారంగా మారింది. ప్రస్తుతం పెళ్లిళ్ల, శుభకార్యాల సీజన్ కావడంతో బంగారం కొనుగోళ్లతో బంగారు, వెండి వర్తక దుకాణాలు సందడిగా ఉన్నా.. స్వర్ణకారులకు చేతినిండా పని లేక ఆందోళన చెందుతున్నారు. పసిడి ధర పైపైకి చేరుకుంటుండంతో వినియోగదారులు సైతం కొద్దిమొత్తం కొనుగోలుతోనే సరిపెట్టుకుంటున్నారు. ఫలితంగా స్వర్ణకారులకు సరిపడా పని లేక ఉపాధికి ఇబ్బంది పడుతున్నారు.



పని తగ్గింది



బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రస్తుతం పది గ్రాములు రూ.70వేలకు చేరింది. పెళ్లిళ్ల, శుభకార్యాల సీజన్ ఉన్నా చేతి నిండా పని ఉండడం లేదు. ధరలు పెరగడంతో అవసరమైన ఆభరణాలే చేయించుకుంటున్నారు. అదనంగా ఆభరణాలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పని లేక ఇబ్బంది అవుతోంది.

– బ్రహ్మయ్యచారి, స్వర్ణకారుడు, భైంసా

అంత ధరతో కొనలేం

ఇంట్లో శుభకార్యం కోసం బంగారం కొనేందుకు వెళ్తే పది గ్రాములు రూ.70వేలు పలుకుతోంది. ఏడాది కిందట రూ.54వేలు ఉన్న ధర ఇప్పుడు ఏకంగా రూ.15వేల వరకు పెరిగింది. దీంతో మాలాంటి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు బంగారం అందని వస్తువుగా మారింది.

– సవిత, గృహిణి, భైంసా

మొక్కజొన్న దగ్ధం



దగ్ధమైన పంటను చూపిస్తున్న అమీరొద్దీన్

కుంటాల: మండలంలోని ఓలా శివారు ప్రాంతంలో ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైంది. సోమవారం వ్యవసాయ మీటర్ల సర్వీసులు చెక్ చేసేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్ రవీందర్ వెళ్లారు. నూర్పిడి చేసేందుకు ఉంచిన మొక్కజొన్న కాలిపోతుండగా గమనించిన ఆయన రైతు అమీరొద్దీన్‌కు సమాచారమిచ్చారు. పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉడుత గూళ్లు పెట్టగా, అవి అటుఇటు వెళ్లే క్రమంలో విద్యుత్ తీగల మధ్య నుంచి నిప్పురవ్వలు పంటపై పడడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక రైతులు వచ్చి మంటలార్పి వేయడంతో ప్రమాదం తప్పింది. రూ.30 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో ఓ ఇంట్లో సోమవారం సిలిండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పేడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మదనపెల్లి వెంకటి ఇంట్లో భార్య వంట చేస్తుండగా సిలిండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వచ్చింది. వెంటనే ఆమె బయటకు పరుగు తీసింది. ఇరుగుపొరుగువారు ఇసుకను జల్లుతూ మంటలార్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. సిలిండర్‌ను దూరంగా తీసుకెళ్లి గ్యాస్‌ను బయటకు తీసివేశారు. దీంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఫైర్ సిబ్బంది ఎం.అశోక్, అజయ్, హుస్సేన్ సాహు పాల్గొన్నారు.



గ్యాస్‌ను బయిటకు తీసివేస్తున్న సిబ్బంది

సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న జిల్లా క్రీడాకారులు

నేరడిగొండ: సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటి గోల్డ్‌మెడల్ దక్కించుకున్నారు. మహారాష్ట్రలోని ఔరంగబాద్ డివిజన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గతనెల 29 నుంచి సోమవారం వరకు 38వ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల,బాలికల చాంపియన్ షిప్ 2023–24 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణ జట్టు పంజాబ్‌పై 3–1 తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. ఈ జట్టులో ఆదిలాబాద్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. నేరడిగొండలో 8వ తరగతి చదువుతున్న మంకాని ఆరుషి, కేజీబీవీ విద్యార్థినులు శ్రీలేఖ, అర్షితలు ఈ పోటీల్లో సత్తా చాటారు. కోచ్ అఖిలతోపాటు క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, సభ్యులు మోహన్, నాగరాజ్, రాదేశ్యం, పీఈటీ కవిత, స్నేహలు అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

లక్ష్మణచాంద: హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5,500 జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టుల సమన్వయ అధికారి సత్రియనాయక్ కథనం ప్రకారం.. మండలంలోని రాచాపూర్‌కు చెందిన రాకేశ్(27), అదే గ్రామానికి చెందిన చిన్నాన్న కొడుకైన రజనీకాంత్ (23) మధ్య 9 ఏళ్లుగా భూవివాదంపై గొడవలు జరుగుతున్నాయి. గ్రామపెద్దల సమక్షంలో సమాన కొలతలు చేసి పంచారు. భూమి తక్కువ వచ్చిందని రజనీకాంత్ పలుమార్లు గొడవపడేవాడు. 2022 ఫిబ్రవరి 26న రాకేశ్‌కు చెందిన కోడి తన ఇంట్లోకి రావడంతో రజనీకాంత్ దుర్భాషలాడాడు. ఎందుకు తిడుతున్నావని అడగడంతో నిన్ను చంపి భూమి సొంతం చేసుకుంటానని కత్తితో రాకేశ్‌ను గాయపర్చాడు. రాకేశ్ భార్య జడ సవిత ఫిర్యాదుతో అప్పటి ఎస్సై యూనిస్ అహ్మద్ కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జీషీటు దాఖలు చేసి, రజనీకాంత్‌ను హాజరుపర్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు కోర్టులో 13 మంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో ఈమేరకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు.

రక్తపు వాంతులు చేసుకుని ఒకరి మృతి



గణేశ్ రాథోడ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని హీరపూర్ పంచాయతీ పరిధిలోని లాల్‌టెకిడి గ్రామానికి చెందిన గణేశ్ రాథోడ్ రక్తపు వాంతులు చేసుకుని మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గణేశ్ రాథోడ్(45) కాంగ్రెస్ కార్యకర్త, గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఆయన రక్తపు వాంతులు చేసుకున్నాడు. ఆ సమయంలో ఎవరూ లేరు. సాయంత్రం కుటుంబీకులు గమనించి 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య పరిమిళబాయి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని బోకర్ తాలుకా కాండ్లి గ్రామానికి చెందిన గణేశ్(45) సోమవారం రాత్రి భైంసాకు వస్తున్నాడు. మండలంలోని టాక్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని రాంనగర్ కాలనీకి చెందిన పెరంబదురి వెంకట గోవిందరాజు (55) డీఆర్‌డీఏ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈయన భార్య మాధవీలత ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. సోమవారం ఆమెను తీసుకువచ్చేందుకు కారులో బయల్దేరాడు. మార్గమధ్యన జాతీయ రహదారిపై ఎదురుగా ఉన్న కంటెయినర్ వాహనాన్ని ఓవర్ టేక్ చేసేక్రమంలో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట గోవిందరాజుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

తామూరు: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై నర్సింగ్‌బాను కథనం ప్రకారం.. మండలంలోని కోలూరు గ్రామానికి చెందిన డైలేవార్ మోగ్లాజీ (27) కొన్నినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగి ఇంటికి వచ్చాడు. మద్యం తాగడానికి డబ్బులివ్వాలని కుటుంబ సభ్యులను అడిగితే లేవని చెప్పారు. మనస్తాపం చెంది తన పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రైతులు మృతదేహాన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఏఎస్సై నర్సింగ్‌బాను పరిశీలించారు. భార్య అర్చన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నాడు.

మహిళను కాపాడిన పోలీసులు

భైంసా: బాసర గోదావరి నదిలో సోమవారం ఆత్మహత్య చేసుకునేందుకు చంటిపాపతో వచ్చిన మహిళను పోలీసులు కాపాడారు. బాసర ఎస్సై గణేశ్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కోస్లి గ్రామానికి చెందిన చందన చంటిపాపతో గోదావరి నది వద్ద అటు ఇటు తిరుగుతూ కనిపించింది. యువకుడు అబ్బువార్ గౌతం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వారు అక్కడికిచేరుకుని ఆమె పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. నందిపేట మండలం ఐలాపూర్‌కు చెందిన పోశెట్టితో తనకు వివాహం జరిగిందని ఏడాది క్రితం భర్త జీవనోపాధి కోసం వేరే దేశానికి వెళ్లాడని బాధితురాలు తెలిపింది. ఇంటి సమస్యలతో మూడు నెలల పాపతో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు చెప్పింది. బాధితురాలి కుటుంబీకులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బువార్ గౌతంను పోలీసులు అభినందించారు.